నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
సోమవారం 16, ఫిబ్రవరి 2026 పేజీలు:4



- చైర్మన్ పీఠం కోసం చివరి వరకు తీవ్రంగా ప్రయత్నించిన చీర్ల రజిని చందర్
- వైస్ చైర్మన్ అభ్యర్థిత్వంపై తర్జనభర్జన
- మొదట్లో మధు గౌడ్ పేరు ప్రతిపాదన
- చివరలో కౌన్సిలర్ వెంకటేష్ పేరు తెరపైకి వచ్చినట్లు ప్రచారం

# పుర పీఠం ఎస్ఎల్ఎన్ మాధవి రమేష్‌దే!




వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్ జి.శ్రీనివాస యాదవ్ జగత్‌పల్లి)-ఫిబ్రవరి 15:

**వనపర్తి మునిసిపల్ పీఠం చైర్మన్‌గా ఎస్ఎల్ఎన్ మాధవి రమేష్‌కే** దాదాపు ఖరారయినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన ఆధిక్యత రావడంతో చైర్మన్ పీఠం కోసం చీర్ల రజిని చందర్ సీనియర్ నాయకుడు ఎస్ఎల్ఎన్ రమేష్ సతీమణి మాధవి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ క్రమంలోనే చైర్ పర్సన్ గా తనకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ మహిళా నాయకురాలు ధనలక్ష్మి సైతం కాంగ్రెస్ అధినాయకులపై ఒత్తిడి తెచ్చినప్పటికీ ఎస్ఎల్ఎన్ మాధవి రమేష్, చీర్ల రజిని చందర్ ల మధ్యే కోటి తీవ్రంగా నెలకొనడంతో ఎమ్మెల్యే మేఘారెడ్డి క్యాంపులో ఉన్న కౌన్సిలర్లను ఒక్కొక్కరిగా పిలిచి అభిప్రాయం సేకరించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే అత్యధికులు ఎమ్మెల్యే మేఘారెడ్డి నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెప్పగా మరికొందరు కౌన్సిలర్లు ఎస్ఎల్ఎన్ మాధవి రమేష్ వైపు మరికొంతమంది చీర్ల రజిని చందర్ పేర్లను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కౌన్సిలర్ల అభిప్రాయాలను ఇతరత్రా అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకొని పార్టీ ప్రతిష్టతే లక్ష్యంగా ఎస్ఎల్ఎన్ మాధవి రమేష్ వైపు ఎమ్మెల్యే మేఘారెడ్డి మొగ్గు చూపుతున్నట్లు మిగతా 2లో..

# పాలకుర్తి పుణ్యక్షేత్రంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం



- ఆలయంలో మిన్నంటిన శివనామ స్మరణ

పాలకుర్తి, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి /ఓరుగంటి సైదులు)-ఫిబ్రవరి 15:

**పాలకుర్తి పుణ్యక్షేత్రంలో శివ పార్వతిల కల్యాణ** మహోత్సవనికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం సోమేశ్వర పుణ్యక్షేత్రంలో భక్తుల కోలాహలంతో పోటెత్తాయి. ఆలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. ''హరహర మహాదేవ శంభో శంకర.. పాహిమాం.. పాహిమాం..'' అంటూ భక్తులు భోళా శంకరుడిని కొలుస్తూ పులకించిపోయారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా భోళా శంకరుడిని దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుంచే ఆలయాల వద్ద క్యూ లైన్లలో బారులు తీరారు. స్వామివారికి పాలాభిషేకాలు, బిల్వార్చనలు, ప్రత్యేక పూజలు తమ మొక్కులు చెల్లించుకున్నారు. పాలకుర్తి శ్రీ సోమేశ్వర శివాలయంలో మహాశివ రాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్ర తినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

శివపార్వతుల కల్యాణ మహోత్సవ చిత్రమాలిక 2లో..

# పాలకుర్తి పుణ్యక్షేత్రంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం



















# పుర పీఠం ఎస్ఎల్ఎన్ మాధవి రమేష్‌దే!

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. ఒకవేళ మరికొద్ది గంటల్లో అదే నిజమైతే ముందు నుంచి ప్రచారం జరిగినట్లుగానే ఎస్ఎల్ఎన్ మాధవి రమేష్ మునిసిపల్ చైర్మన్ బాధ్యతలు చేపట్టే అవకాశాలు అత్యధికంగా ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. పోటీపడిన చీర్ల రజిని చందర్ కు పార్టీ పరంగా ఉన్నత గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఏది ఏమైనప్పటికీ నేటి మధ్యాహ్నం కల్లా చైర్మన్ అభ్యర్థి ఎవరనేది ప్రజలకు స్పష్టం కానుంది.

## వైస్ చైర్మన్‌పై తర్జనభర్జన

వనపర్తి మునిసిపల్ వైస్ చైర్మన్‌పై కాంగ్రెస్‌లో తర్జనభర్జన నెలకొంది. మొదటి నుంచి పదవ వార్డు కౌన్సిలర్ మధుసూదన్ గౌడ్ పేరు దాదాపుగా ఖరారు అయినప్పటికీ చివరి నిమిషంలో ఎమ్మెల్యే మేఘారెడ్డికి సన్నిహితుడయిన ఓ నాయకుడి ఒత్తిడి కారణంగా ఐదవ వార్డు కౌన్సిలర్ బాపనిపల్లి వెంకటేష్ వైపు ఎమ్మెల్యే మేఘారెడ్డి మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. పార్టీలోని కొందరు కౌన్సిలర్లు వైస్ చైర్మన్ అభ్యర్థిత్వంపై అభిప్రాయాలు సేకరించకపోవడంతో అసహనం వ్యక్తం చేయగా వైస్ చైర్మన్ అవకాశం తనకు ఇవ్వాలని 20వ వార్డు కౌన్సిలర్ పాకనాటి కృష్ణ సైతం కోరినట్లు తెలుస్తోంది. వైస్ చైర్మన్ మధు గౌడ్ లేక వెంకటేషా అనేది మరికొద్ది సేపట్లో స్పష్టం కానుంది.

# వనపర్తి, పెబ్బేరు పీఠాలను బీసీలకే ఇవ్వాలి

**-బీసీ పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్



వనపర్తి, పెబ్బేరు మున్సిపల్ చైర్ పర్సన్ పీఠాలను బీసీలకే ఇవ్వాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు.

ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వనపర్తి మున్సిపాలిటీలో ఉన్న 33 వార్డుల్లో బీసీలు 25 మంది కౌన్సిలర్లుగా గెలుపొందారని, న్యాయబద్ధంగా బీసీ సామాజిక వర్గానికే చైర్ పర్సన్ పదవిని ఇవ్వాలని అన్నారు. అలా కాకుండా ఇతర సామాజిక వర్గానికి చైర్ పర్సన్ పదవి ఇస్తే బీసీలకు అన్యాయం చేయడమే అవుతుందన్నారు.

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వనపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పదవితో పాటు డీసీసీ పదవి కూడా శివసేనారెడ్డికి ఇలా ఒకే సామాజిక వర్గానికి దక్కిందని, అంతేకాకుండా పెబ్బేరు మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు కూడా వారికే కేటాయించుకున్నారని గుర్తు చేశారు. గడిచిన ఈ రెండేళ్లలో కేవలం ఒక్క వనపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ పదవి మాత్రమే బీసీలకు ఇచ్చారని, ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల్లో బీసీల కౌన్సిల్ సంఖ్యను గుర్తించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు సమన్యాయం చేకూరుతుందని ప్రజల్లో నమ్మకం కలిగించాల్సిన బాధ్యత నాయకులపై ఉందని, అలాకాకుండా డబ్బుకు, పలుకుబడికి ప్రాధాన్యత కల్పిస్తే ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతామని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు వివి గౌడ్, దేవర శివ, మహేందర్ నాయుడు, ధర్మేంద్ర సాగర్, బత్తుల జితేందర్, అస్కని రమేష్, యశ్వంత్, చెలిమిల్ల రామన్ గౌడ్, కృష్ణ ప్రసాద్, నరేందర్ సాగర్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**కైలాసగిరిలో శివుడికి ప్రత్యేక పూజలు**

కాప్రా, ఫిబ్రవరి 15 (నేటి ఫోకస్ న్యూస్):

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కైలాసగిరిలో వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, శ్రీనివాస్ రెడ్డి ఆయనతో కలిసి శివనామ స్మరణతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.పరమశివుని అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... పరమశివుని కృపతో ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడగా, శివనామ జపంతో కైలాసగిరి ప్రాంతం భక్తిశ్రద్ధలతో మార్మోగింది.



# కాంగ్రెస్ పార్టీలో చేరిన 8వ వార్డు కౌన్సిలర్ లలిత గణేష్

కల్వకుర్తి, నేటి ఫోకస్ న్యూస్ ఫిబ్రవరి 15:

కల్వకుర్తి మున్సిపాలిటీ 8వ వార్డులో ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందిన కోడెల లలిత గణేష్ యాదవ్ ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ యాదవ్, వెల్దండ సర్పంచ్ మట్ట వెంకటయ్య గౌడ్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# పెద్దవంగర మండలంలో మిన్నంటిన శివనామ స్మరణ

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఒరుగంటి సైదులు ఫిబ్రవరి 15



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దవంగర మండలంలోని శైవక్షేత్రాలు ఆదివారం భక్తుల కోలాహలంతో పోటెత్తాయి. ఆలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. "హరహర మహాదేవ శంభో శంకర.. పాహిమాం.. పాహిమాం.." అంటూ భక్తులు భోళా శంకరుడిని కొలుస్తూ పులకించిపోయారు.

శివరాత్రి పర్వదినం సందర్భంగా భోళా శంకరుడిని దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుంచే ఆలయాల వద్ద క్యూ లైన్లలో బారులు తీరారు. స్వామివారికి పాలాభిషేకాలు, బిల్వార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

మండలంలోని చిన్న వంగర గ్రామంలో గల శివాలయంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ వార్డు మెంబర్ శివరాత్రి శోభ – సోమనర్సు దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. తాగునీరు, ప్రసాద వితరణతో పాటు క్యూ లైన్లను పర్యవేక్షించారు. ఆలయాలన్నీ విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా వెలిగిపోయాయి.

# ఎక్స్ అఫీషియో సభ్యులకు ఓటు హక్కు

**రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టీకరణ**

హైదరాబాద్,ఫిబ్రవరి14(ఫోకస్ న్యూస్):




మున్సిపల్ పరోక్ష ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన జారీ చేసింది. మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో ఎక్స్‌అఫీషియో సభ్యుల ఓటుహక్కుపై స్పష్టతనిచ్చింది. తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం–2019 ప్రకారం.. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఇతర ఎక్స్‌అఫీషియో సభ్యులకు ఓటు హక్కు తప్పనిసరి అని తెలిపింది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కానివారు ఓటు వేసేందుకు అనర్హులని సీఈసీ స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కాకుండా ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఓటువేసే వారిని అనర్హులుగా పరిగణిస్తారని, వారి ఓట్లు చెల్లవని న్యాయస్థానం తెలిపింది. ఈ నేపథ్యంలో కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సీఈసీ సర్క్యులర్ జారీ చేసింది. నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించింది. దీంతో స్థానిక ఓటు హక్కు ఉంటేనే ఎంపీలు, ఎమ్మెల్సీలు.. మేయర్/ఛైర్ పర్సన్ పదవుల ఎన్నికల్లో ఓటువేసే ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది.

# ఆర్యవైశ్యులకే చైర్మన్ పీఠం ఇవ్వాలి

**-జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇటుకూరి బుచ్చయ్య**

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

వనపర్తి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని ఆర్యవైశ్యులకే కేటాయించాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇటుకూరి బుచ్చయ్య, కార్యదర్శి మారం బాలేశ్వరయ్యలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వనపర్తి మునిసిపాలిటీ ఏర్పడిన తర్వాత ఏనాడు కూడా ఆర్యవైశ్యులకు చైర్మన్ పీఠం దక్కలేదని ఈసారి ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన ఎస్ఎల్ఎన్ మాధవి రమేష్ కు చైర్మన్ పీఠం దక్కుతుందని వనపర్తి లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగిందన్నారు. ఆర్యవైశ్యులకు చైర్మన్ పీఠం ఇస్తారన్న నమ్మకంతో పార్టీలకు అతీతంగా ఆర్యవైశ్యులంతా కాంగ్రెస్ కౌన్సిలర్లకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించామని తెలిపారు. ఎస్ఎల్ఎన్ మాధవి రమేష్ కు చైర్మన్ పీఠం ఇవ్వకుంటే వ్యాపార సముదాయాలు మూసివేసి రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఇకనైనా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, డిసిసి అధ్యక్షులు శివసేనారెడ్డి, జిల్లా మంత్రులు స్పందించి ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చైర్మన్ పీఠం దగ్గర కృషి చేయాలని డిమాండ్ చేశారు.



# బిజెపితో బిఆర్ఎస్ పొత్తులకు తెర

### తోకపార్టీలకే తోక పార్టీగా మారిన బిఆర్ఎస్

### సిపిఐకి మద్దతు ఇస్తామనడమే ఇందుకు నిదర్శనం

### మీడియాతో జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్,ఫిబ్రవరి14(ఫోకస్ న్యూస్):
మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు తొలి అడుగు పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కంచుకోట ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ బలహీన పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని అన్నారు. కమ్యూనిస్టులను తోక పార్టీగా అభివర్ణించిన బీఆర్ఎస్.. ఇప్పుడు సీపీఐకు మద్దతు ఇస్తానంటోందని వ్యాఖ్యలు చేశారు. తోక పార్టీలకే.. బీఆర్ఎస్ తోక పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. సీపీఐ అడగకుండానే.. కొత్తగూడెంలో సీపీఐకు కేటీఆర్ ఓపెన్ ఆఫర్ ఇవ్వటం దిగజారుడే అని చెప్పుకొచ్చారు. కేసీఆర్, బీఆర్ఎస్‌ను అసెంబ్లీలో కూనంనేని సాంబశివరావు ఎన్ని మాటలు అన్నారో కేటీఆర్‌కు గుర్తు లేదా అని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని ఆరోపణలను కేటీఆర్ ఒప్పుకున్నట్లేనా అని కవిత నిలదీశారు. కార్మికుల కోసం సీపీఐకు మద్దతు అంటోన్న కేటీఆర్ నయ వంచన చేసుకుంటున్నారని అన్నారు. అవసరం వచ్చినప్పుడు.. బీఆర్ఎస్‌కు కార్మికులు గుర్తొస్తారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని మున్సిపల్ ఫలితాలు చెప్తున్నాయన్నారు. మున్సిపాలిటీలను తీర్చిదిద్దానని చెప్పుకుంటోన్న కేటీఆర్.. ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ఈ స్థానాలు రావడమే ఎక్కువ అన్నట్లు కేటీఆర్ మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. 'నేనే రాజు నేనే మంత్రి.. సీఎం పదవి ఆరు నెలలు బోనస్' అంటోన్న రేవంత్.. రైతుల బోనస్ గురించి మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు. జాగృతిపై కామెంట్స్ చేస్తోన్న వారికి చెప్తున్న.. ఇది జస్ట్ ట్రైలర్.. పిక్చర్ బాకీ హై' అని అన్నారు కవిత. కరీంనగర్ కార్పొరేషన్ కోసం బీజేపీ అష్టకష్టాలు పడుతోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో తప్ప బీజేపీ ఎక్కడా లేదన్నారు. సింగరేణి ఎన్నికల్లో కూడా ఏఐఎఫ్‌బీతో కలిసి జాగృతి పోటీ చేస్తుందని ప్రకటించారు. 40కి పైగా స్థానాల్లో జాగృతి, ఏఐఎఫ్‌బీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు కవిత. వడ్డేపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రలోభాలకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎవరికి మద్దతివ్వాలో స్థానిక జాగృతి నేతలు డిసైడ్ చేసుకుంటారని తెలిపారు. చట్టాలను ఉల్లంఘించి ప్రభుత్వ సొమ్ముతో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారని కవిత ఆరోపించారు. గతంలో 90 శాతం గెలిచిన బీఆర్ఎస్.. 17 సీట్లకు పడిపోవటం దారుణమన్నారు. ఉత్తర తెలంగాణలో బీజేపీకి మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ ముందే డిసైడ్ అయిందని కవిత వ్యాఖ్యలు చేశారు.

# మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

### మున్సిపల్ ఫలితాలపై పార్టీ నేతలతో సిఎం రేవంత్

### గెలిపించిన సీనియర్ మంత్రులకు అభినందనలు

### భద్రాద్రి కొత్తగూడెంపై కుదిరిన అవగాహన

### మేయర్ సిపిఐకి, డిప్యూటి మేయర్ కాంగ్రెస్‌కు

### సిఎం రేవంత్‌తో పల్లా వెంకట్ రెడి&ఢ భేటీలో నిర్ణయం

హైదరాబాద్,ఫిబ్రవరి14(ఫోకస్ న్యూస్):
తెలంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. మనపట్ల ప్రజల నమ్మకం పెరిగేలా అభివృద్ధి సాగాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ చేయడమే కాకుండా.. నిజామాబాద్, కొత్తగూడెం కార్పొరేషన్లలో మేయర్ పీఠాలను కైవసం చేసుకునే వ్యూహాలపై దిశానిర్దేశర చేశారు. మంచి ఫలితాలు సాధించారని మంత్రులు, సీనియర్ నేతలను అభినందించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకాన్ని కల్పించామన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత ముందుకెళ్లాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఫలితాలను బేరీజు వేసుకుని మరింతగా పార్టీని పటిష్టం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. హంగ్ అసెంబ్లీలు ఉన్నచోట వాటిని దక్కించుకునేలా వ్యూహాత్మకంగా కదలాలని అన్నారు. ఇందులో మంత్రులు, పిసిసి చీఫ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మంచి ఫలితాలు వచ్చినా, నిజామాబాద్, కొత్తగూడెంలలో మేయర్ పదవులను దక్కించుకోవడంపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. నిజామాబాద్‌లో మేయర్ పీఠం దక్కించుకునేందుకు ఎంఐఎం పార్టీతో చర్చలు జరపాలని పీసీసీ చీఫ్‌కు సీఎం రేవంత్ సూచించారు. కొత్తగూడెంలో స్వతంత్ర అభ్యర్థులు, ఇతర చిన్న పార్టీల మద్దతు కూడగట్టి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని నిర్ణయించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై మంత్రులను, కార్యకర్తలను అభినందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులను మా ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే చేసి చూపించింది. మా సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకున్న నమ్మకమే ఈ విజయానికి పునాది' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రులందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ స్థాయిలో ఫలితాలు వచ్చాయని ఆయన కొనియాడారు. ఎన్నికల విజయం కేవలం ఆరంభం మాత్రమేనని, అసలైన అభివృద్ధి ఇప్పుడే మొదలవ్వాలని మంత్రులకు సీఎం సూచించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు, మంత్రులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను, సంక్షేమ ఫలాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో వచ్చే అన్ని ఎన్నికలనూ ఎదుర్కోవాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదిలావుంటే సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, తాజా పరిణామాలు, కొత్తగూడెం కార్పొరేషన్ గురించి చర్చించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ కూటమి (కాంగ్రెస్-22, సీపీఎం-1) 23 డివిజన్లలో విజయం సాధించింది. సీపీఐకి 22, బీఆర్ఎస్-8, భాజపా-1, స్వతంత్రులు 6 డివిజన్లలో గెలుపొందారు. స్వతంత్రుల్లో ఒకరు సీపీఐ నాయకుడు
కావటంతో ఆ పార్టీ బలం కూడా 23కు చేరింది. మిగిలిన ఐదుగురు స్వతంత్రుల్లో ముగ్గురు, బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారిలో ముగ్గురు హస్తం గూటికి చేరటంతో కాంగ్రెస్ కూటమి బలం 29కు పెరిగింది. అయితే భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఉత్కంఠ వీడింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్ రెడ్డి సమావేశం కావడంతో ఉత్కంఠకు తెరపడింది. కొత్తగూడెం కార్పొరేషన్ అంశంపై చర్చించిన నేతలిద్దరూ ఓ అంగీకారానికి వచ్చారు. మేయర్ పోస్ట్ సీపీఐకి, డిప్యూటీ మేయర్ పోస్ట్ కాంగ్రెస్ పార్టీకి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. దీంతో కొత్తగూడెం కార్పొరేషన్ అంశం ఓ కొలిక్కి వచ్చింది. కాగా, ఈ కార్పొరేషన్‌లోని 60 డివిజన్లకు ఈనెల 11న ఎన్నికలు జరగ్గా.. 13న ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో కాంగ్రెస్ 22, సీపీఐ 22, బీఆర్ఎస్ 8, సీపీఎం 1, బీజేపీ 1, స్వతంత్రులు 6 స్థానాల్లో జయకేతనం ఎగురవేశారు. మరోవైపు కొత్తగూడెం కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ 8 డివిజన్లను సొంతం చేసుకుంది. అయితే, వారంతా కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరిగింది. దీనిపై ఆ 8మంది కార్పొరేటర్లు స్పందించారు. మేయర్ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం చెప్పిందే తమకు శిరోధార్యమంటూ తేల్చి చెప్పారు. పార్టీ నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఈ మేరకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు అమ్ముడు పోయారంటూ చేసే ప్రచారం అవాస్తమంటూ వీడియో విడుదల చేశారు.

# స్పా సెంటర్ ముసుగులో వ్యవభిచారం

### పోలీసుల మెరుపు దాడిలో 45మంది అరెస్ట్

హైదరాబాద్,ఫిబ్రవరి14(ఫోకస్ న్యూస్):
కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ పరిధిలో స్పా సెంటర్ల పేరుతో సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లోని గాయత్రి రెసిడెన్సీలో ఉన్న 'ఆసన వెల్నెస్ స్పా' సెంటర్‌లో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం జరుగుతుందన్న పక్కా సమాచారంతో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పోలీసులు మొత్తం 15 మంది యువతులను, 30 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు నిర్వాహకులు కాగా, మిగిలిన 27 మందిని విటులుగా గుర్తించి అందరిపై కేసులు నమోదు చేశారు. పోలీసుల విచారణలో ఈ దందాకు సంబంధించిన షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇర్ఫాన్ అనే వ్యక్తి గత ఏడాది కాలంగా ఈ స్పా సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఫుల్ బాడీ మసాజ్, అరోమా మసాజ్ వంటి పేర్లతో కస్టమర్లను ఆకర్షించి, లోపల నిబంధనలకు విరుద్ధంగా క్రాస్ మసాజ్ , వ్యభిచార కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తేలింది. ఈ ముఠాకు కూకట్‌పల్లి 9వ ఫేజ్‌లో కూడా మరో బ్రాంచ్ ఉన్నట్లు సమాచారం అందడంతో, పోలీసులు ఆ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. ఈ రైడ్ సందర్భంగా నిందితుల నుంచి పోలీసులు 45 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్పా సెంటర్ల ముసుగులో ఇలాంటి అసాంఘిక పనులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పట్టుబడ్డ యువతులను రెస్క్యూ హోమ్‌కు తరలించగా, నిర్వాహకులు , విటులపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. నగరంలో ఇలాంటి అక్రమ సెంటర్ల జాబితాను తయారు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారు.

# ఫార్ములా-ఈ కార్ రేసులో కీలక పరిణామం

### ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్ విచారణకు అనుమతి

హైదరాబాద్,ఫిబ్రవరి14(ఫోకస్ న్యూస్):
ఫార్ములా-ఈ కార్ రేసు కేసు కీలక మలుపు తిరిగింది. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ప్రాసిక్యూషన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతి లభించింది. ప్రాసిక్యూషన్ విషయంపై రాష్ట్రానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. ఫార్ములా-ఈ రేసింగ్ ఒప్పందాల్లో నిబంధనల ఉల్లంఘన జరిగిందని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ గతంలోనే కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ని విచారించడానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అరవింద్ కుమార్ విషయంలో కేంద్రం అనుమతి ఇవ్వడంతో.. ఇప్పుడు ఏసీబీ ఆయనపై కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు పూర్తి స్వేచ్ఛ పొందింది. కాగా, ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ ఉన్నారు.

# ట్రక్కును ఢీకొన్న కారు

### నలుగురు కోబ్రా కమెండోల దుర్మరణం

రాయపూర్,ఫిబ్రవరి14(ఫోకస్ న్యూస్):
ఛత్తీస్‌గఢ్ లోని ధమ్‌తారి జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. శనివారం ఉదయం జిల్లాలోని ఖప్రి బైపాస్‌పై ఆగి ఉన్న ట్రక్కును.. కోబ్రా కమాండోలు ప్రయాణిస్తున్న కారు ఢీ కొట్టడంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో కమాండో ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దేశ రక్షణకోసం పోరాడే కమాండోలు నలుగురు ఒకేసారి మృతి చెందడంతో రాష్ట్ర వ్యాప్తంగా విషాదఛాయలు అలుముకున్నాయి. సెలవు మంజూరు చేసిన తర్వాత కమాండోలు జగదల్‌పూర్ నుంచి రాయ్‌పూర్‌కు వెళ్తుండగా ఆగి ఉన్న ట్రక్కును వెనుక వైపు బలంగా ఢీ కొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ కమాండోలు నలుగురు స్పాట్‌లోనే మృతి చెందారు. మృతులు ముఖేష్ కుమార్, ఉమేంద్ర సింగ్, రాజ్ కుమార్ గౌర్, డ్రైవర్ హీరాలాల్ నగర్‌గా గుర్తించారు. మరో కమాండో అభిమాన్ రాయ్‌గా గుర్తించారు. అతనికి వైద్య చికిత్స అందిస్తున్నారు.